క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డికి ఘన స్వాగతం


విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఎంపీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: రాజ్య సభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి విశాఖ విమానాశ్రయంలో బుధవారం ఘన స్వాగతం లభించింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ ముమ్మన దేవుడు, పేడాడ రమణ కుమారి తదితరులు ఆయనకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

డిఫెన్స్ సెక్రటరీ దృష్టికి సమస్యలు


డిఫెన్స్ సెక్రటరీ గిరిధర్‌తో అఖిల పక్ష యూనియన్ ప్రతినిధులు

మల్కాపురం: హిందూస్థాన్ షిప్‌యార్డ్‌లో ఎఫ్ఎస్ఎస్ షిప్స్ కీల్ ప్లేట్ పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్రరక్షణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి గిరిధర్‌ను బుధవారం షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ ప్రతినిధులతో పాటు,బీఎంఎస్,సీఐటీయూ,వైఎస్సార్‌టీయూసీ, ఎల్ సీరిస్ జేఈసీ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిశారు. పర్మినెంట్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలతో పాటు ఎల్ అండ్ ఎం సీరిస్ పర్మినెంట్ అంశాన్ని ఆయన దృష్టికి యూనియన్ల ప్రతినిధులు తీసుకు వెళ్లారు. దీనిపై గిరిధర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులూ.. అనాలోచిత నిర్ణయాలొద్దు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్‌లో ఎలాంటి ఫలితాలు వచ్చినా విద్యార్థులు ఎటువంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవద్దని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 12న ఇంటర్ ఫలితాలు ప్రకటిస్తున్నట్టు బోర్డు నుంచి సమాచారం ఉందన్నారు. పరీక్షలు, మార్కులు, పాస్, ఫెయిల్ అనే అంశాలు విద్యార్థి దశలో చిన్నమెట్టు మాత్రమేనని పేర్కొన్నారు. పట్టుదల ఉంటే జీవితంలో ఎన్నో సాధించవచ్చని, కానీ కొంత మంది విద్యార్థులు ఆత్మన్యూనతా భావంతో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులతో ప్రేమ పూర్వకంగా మెలగాలన్నారు.

120 మందికి గుండె వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీలో ఆడారి తులసీరావు ట్రస్టు ద్వారా బుధవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 120 మందికి గుండెకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. సమస్యలు ఉన్న వారికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. ఉచితంగా మందులు అందజేశారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం,జీవీఎస్ఎన్‌రాజు (కేబుల్ వాసు)దగ్గరుండి పర్యవేక్షించారు.

నేటి నుంచి ఉచిత హెల్త్ చెకప్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అంబేడ్కర్ కళాక్షేత్రం (సీడబ్ల్యూసి-1)లో గురువారం నుంచి ఉచిత హెల్త్ చెకప్ నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం కార్యదర్శి డొక్కా నర్సింగరావు తెలిపారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని, నగరంలోని మాధవ్‌బాగ్ మల్టీ డిసిప్లినరీ కార్డియాక్ కేర్ క్లినిక్ అండ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఈ హెల్త్ చెకప్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

సామాజిక వేదిక.. బెంగ లేదిక


62వ వార్డు ఏఎస్ఆర్‌కాలనీలో నిర్మించిన సామాజిక భవనం


58వ వార్డు ములగాడలో నిర్మించిన భవనం


గాంధీజీవీధి వద్ద నిర్మించిన నూతన సామాజిక భవనం

- నూతన సామాజిక భవనాల నిర్మాణం
- శిథిలావస్థలో ఉన్న భవనాలకు పూర్తి స్థాయి మరమ్మతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న పలు వార్డుల ప్రజలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత వాసుల కష్టాలు తీరాయి. గతంలో సామాజిక భవనాలు లేక ఏ చిన్న కార్యక్రమం చేసుకోవాలన్నా రోడ్లే వేదికలుగా మారేవి. మరి కొంత మంది ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించేవారు. పేదల మాత్రం ఎండైనా.. వానైనా రోడ్ల మీదే కార్యక్రమాలు చేసుకునేవారు. ఇలాంటి తరుణంలో పలు వార్డుల్లో నూతన హంగులతో సామాజిక భవనాలు నిర్మించారు. దీంతో ఆయా ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ నాయకుడు ,ఏ ప్రభుత్వం గానీ ఇలా ఆలోచన చేయలేదని చెబుతున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు తమ ప్రాంతానికి వచ్చిన పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను తమ ప్రాంతాల్లో సామాజిక భవనాలు నిర్మించాలని కోరడంతో ఆయన స్పందించి వీటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవడం చాలా ఆనందంగా ఉందని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పలు ప్రాంతాల్లో సామాజిక భవనాల నిర్మాణానికి చేసిన వ్యయం

వార్డు	సామాజికభవనం నిర్మించిన ప్రాంతం	ఖర్చు
58	ఉప్పరకాలనీ	రూ 19.80 లక్షలు
58	ములగాడ	రూ. 16 లక్షలు
	చిన్న ములగాడ	రూ. 15 లక్షలు
	ములగాడ ఎస్సీ కాలనీ మరమ్మతులు	రూ. 10 లక్షలు
	గుల్లలపాలెం	రూ. 16 లక్షలు
60	వుడాకాలనీ వద్ద	రూ 6.7 లక్షలు
	హనుమాన్‌సంజీవ్‌కాలనీ	రూ. 30 లక్షలు
	ఇందిరాకాలనీలో	రూ. 35 లక్షలు
61	ప్రియదర్శినికాలనీ	రూ 9.30లక్షలు
	మల్కాపురం	రూ 48.60 లక్షలు
	గాంధీజీవీధి	రూ.10 లక్షలు
62	గుడివాడ అప్పన్నకాలనీ	రూ 6.2 లక్షలు
	ఏఎస్ఆర్‌కాలనీ	రూ. 20 లక్షలు

సంతోషంగా ఉంది


61వ వార్డు మల్కాపురంలో మా వినతిని స్వీకరించి సామాజి కభవనం నిర్మించారు. చాలా సంతోషంగా ఉంది.గత పాలకులకు పలుమార్లు ఈ సమస్యపై వివరించాం.వారి నుంచి నాడు ఎలాంటి స్పందన లేదు. సామాజిక భవనం నిర్మించడంతో పలు కార్యక్రమాలకు అవస్థలు తీరాయి.

-పవన్‌యాదవ్, మల్కాపురం

చెప్పిన వెంటనే స్పందించారు


మా ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ వచ్చారు. అప్పుడు గాంధీజీవీధిలో సామాజిక భవనం కావాలని స్థానిక మహిళలతో కలిసి వివరించాం. ఆయన స్పందించి రెండు నెలల వ్యవధిలో పలు వసతులతో కూడిన భవనం నిర్మించే విధంగా చర్యలు తీసుకున్నారు.

- బాలు, గాంధీజీవీధి

ఇబ్బందులు తప్పాయి


మా ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్‌తో కలిసి ఆడారి ఆనంద్‌కుమార్ వచ్చారు. ఆ సమయంలో సామాజిక భవనం లేక పడుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లాం. ఆ మరసటి నెలలో రూ. 20 లక్షలతో భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇచ్చిన మాటపై నిలబడే నాయకులు పాలకులుగా ఉండడం చాలా సంతోషంగా ఉంది. సామాజిక భవనం అందుబాటులోకి రావడంతో ఇబ్బందులు తప్పాయి.

- సమ్మిడి పైడిరాజు, శ్రీహరిపురం

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది


కంటి పరీక్షలు చేసుకుంటున్న ఆడారి మాలతి

గోపాలపట్నం: ఆడారి తులసీరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్రకాలనీ కమ్యూనిటీ హాలులో బుధవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఆడారి తులసీరావు ట్రస్ట్ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ భార్య ఆడారి మాలతి సందర్శించారు. శిబిరానికి వచ్చిన వారితో ఆమె మాట్లాడారు. ఇక్కడి ఏర్పాట్లు వైద్య పరీక్షలు ఏవిధంగా ఉన్నాయో ఆరా తీశారు. ఆమె కూడా కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, శస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా రాములోరి పెళ్లి రాట


కరాసా రామాలయం పెళ్లి రాట వేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు పాతకరాసా సీతారామాలయం ప్రాంగణంలో శ్రీరామ నవమి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. సీతారామ కల్యాణ మహోత్సవం సందర్భంగా బుధవారం శాస్త్రోక్తంగా పెళ్లి రాట వేశారు. కార్యక్రమంలో బంగారమ్మ, దుర్గాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పూలే


జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ తదితరులు

గోపాలపట్నం: అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శప్రాయుడని ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ అన్నారు. పూలే జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఎన్ఎస్‌టీఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఆర్‌డీవోడైరెక్టర్ జనరల్ వై. శ్రీనివాసరావు, ఎన్ఎస్టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, ప్రొఫెసర్ బి. భరత లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే జీవితం ఆదర్శనీయమని కొనియాడారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పెందుర్తిలోని వృద్ధాశ్రమానికి రూ. 3000 అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఉర్బన్ కుమార్, అమర్జిత్, ఎన్ఎస్‌టీఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్, వర్క్స్ కమిటీ నాయకులు సీహెచ్ చంద్రశేఖరరావు, జేఎన్ వర్మ, జి. నాగభూషణం, రోజాలిన్ మల్లిక్, ఓడీసీ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

గంగవరం పోర్టు వద్ద కార్మికుల ఆందోళన


గంగవరం పోర్టు వద్ద బైఠాయించిన కార్మికులు

పెదగంట్యాడ: తమ డిమాండ్ల సాధన కోసం గంగవరం పోర్టు కార్మికులు బుధవారం ఆందోళనకు దిగారు. యాజమాన్య ప్రతినిధుల తీరును నిరసిస్తూ ధర్నా చేశారు. పోర్టు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీ గంగవరం పోర్టులో పని చేస్తున్న ముగ్గురు కార్మికులు ఇటీవల మృతి చెందారని చెప్పారు. అయితే మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేదన్నారు. విధి నిర్వహణలో ఉన్న కార్మికులు మృత్యువాత పడితే వెంటనే రూ.25లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో నష్టపరిహారం కింద రూ.50లక్షలు ఇచ్చి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గాయపడితే కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స అందించాలన్నారు. లేనిపక్షంలో గంగవరం పోర్టును తరలించాలని, మా సముద్రాన్ని మాకు అప్పగించాలన్నారు. ఈ ఆందోళనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు పోలీసులకు అక్కడికి చేరుకుని, కార్మికులతో చర్చించారు.

దూరవిద్య విద్యార్థులకు పరీక్షల విధానంపై అవగాహన


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రంలో ఇటీవల ప్రవేశాల పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం బుధవారం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించారు. యూజీసీ సూచించిన విధంగా విద్యార్థులకు దూరవిద్యలో విద్యను అందించే విధానం, అకడమిక్ క్యాలెండర్, బోధన, అభ్యసనం, పరీక్షల విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రత్యక్ష విద్యకు సమానంగా దూరవిద్య కేంద్రంలో బోధన ఉంటుందని విద్యార్థులకు దూరవిద్య కేంద్రం సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, సహాయ సంచాలకుడు ఆచార్య చంద్రశేఖర్, దూర విద్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ నూతన డైరెక్టర్‌కు అభినందనలు


డైరెక్టర్ గణేష్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) సిహెచ్.ఎస్.ఆర్.వి. గోపాలకృష్ణ గణేష్‌ను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు. నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా నాయకులు బుధవారం ఆయనను ఉక్కు పరిపాలన భవనంలో కలిసి, సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.మస్తానప్ప, దాలినాయుడు, జి.అప్పలరాజు, పిట్టా రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, కాళ్ల అప్పారావు, ఎన్.టి.అప్పారావు, చంద్రశేఖర్, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపిస్తాం..

- యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారికి మద్దతుగా విస్తృత ప్రచారం


కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీని కలిసి మద్దతు కోరుతున్న ఆడారి మాలతి


శ్రీహరిపురంలో ప్రచారం చేస్తున్న రమాకుమారి, కార్పొరేటర్ లావణ్య


40వ వార్డులో ప్రచారం చేస్తున్న రమాకుమారి, ఉమారాణి, గుండపు నాగేశ్వరరావు

మల్కాపురం: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం తప్ప.. మోసం చేయడం తమకు తెలియదని, నమ్మి ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సోదరి, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారి అన్నారు. 58వ వార్డు శ్రీహరిపురంలో కార్పొరేటర్ లావణ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ గత పదేళ్లుగా పదవిలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే గణబాబు పారిశ్రామిక ప్రాంతంలో ఎవరికైనా సాయం చేశారా? అని ప్రశ్నించారు. పోనీ ఆ పార్టీని నమ్ముకుని, ఆయన వెంట నడిచిన కార్యకర్తకైనా న్యాయం చేశారా? అని నిలదీశారు. పశ్చిమలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఆడారి ఆనంద్‌కుమార్ పగ్గాలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు సుమారు రూ.220 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని వివరించారు. పదేళ్లుగా అధికారంలో ఉన్న గణబాబు ఏ స్థాయిలో పశ్చిమను అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ప్రజలారా మరోసారి మోసపోవద్దని, నిజాయితీపరుడు, సేవతత్పరుడు, పిలిస్తే పలికే నాయకుడు ఆనంద్‌కుమార్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె అభ్యర్థించారు.

- 40వ వార్డు ఏకేసీ కాలనీలో బుధవారం సాయంత్రం పిల్లా రమాకుమారి, పీలా ఉమారాణి, కార్పొరేటర్ నాగేశ్వరరావు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.
- 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీలో పార్టీ వార్డు అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు కుంచారావు, కృష్ణ, రాజు, కిషోర్, రాము పాల్గొన్నారు.

91వ వార్డులో..

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గోపాలపట్నం ప్రధాన రహదారిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా ఆయన భార్య మాలతి 92వ వార్డు కార్పొరేటర్ బెహరా వెంకట స్వర్ణలత శివదేవితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీకి విజయం కట్టబెట్టాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌తో పాటు విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధా శివాజీని కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణికుమారి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


59వ వార్డులో..

57వ వార్డులో..

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌కు మద్దతుగా జీవీఎంసీ 57వ వార్డులో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కంచరపాలెం పరిధి ఆశవానిపాలెం, 104 ఏరియా పరిధి శ్యామ్‌నగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ ముర్రు వాణి ఆధ్వర్యంలో ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు రమణికుమారి ఇంటింటి ప్రచారం చేశారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పిన్నింటి అప్పలరాజు, 52, 56, 57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్ యాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చెంగల ఈశ్వరరావు, జిల్లా యూత్ కార్యదర్శి రేసపు శ్రీనువాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆశవానిపాలెం ఎన్నికల ప్రచారంలో కార్పొరేటర్ ముర్రు వాణి, ఆడారి మాలతి

మనసున్న నాయకుడికే పట్టం కడదాం

జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు


92వ వార్డు ఇందిరానగర్‌లో ప్రచారం చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: మంచి మనసున్న నాయకుడు.. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటేనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అండగా ఉంటున్న పశ్చిమ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. 92వ వార్డు ఇందిరానగర్‌లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని, అలాగే ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి కి మంచి మెజారిటీ తీసుకు వస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన సంక్షేమం ప్రతీ ఇంటికి చేరిందని చెప్పా రు. ఆడారి ఆనంద్ కుమార్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించారని .. ఏడాదిన్నరలో ఆయన చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

మనస్తాపంతో బాలుడి మృతి


భవానీశంకర్ (ఫైల్)

గోపాలపట్నం: అల్లారు ముద్దుగా పెంచిన నాయినమ్మ చనిపోవడంతో మనస్తాపానికి గురైన ఓ బాలుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎస్సీ కాలనీలో జరిగింది. ఎయిర్‌పోర్టు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. తూగూరి భవానీశంకర్(17) అలియాస్ చందు బుచ్చిరాజుపాలెం ఎస్సీ కాలనీలో తండ్రి శివదుర్గ నాగరాజు, తాతయ్య కన్నయ్యతో కలిసి నివసిస్తున్నాడు. ఇటీవల బాలుడి నాయినమ్మ సుజాత అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన భవానీశంకర్ బుధవారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం వరకు ఇంటి బయట కూర్చుని ఉన్న భవానీశంకర్.. ఆతర్వాత ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. ఎప్పటిలాగే తలుపులు వేసుకుని పడుకుని ఉంటాడని భావించిన తాతయ్య కన్నయ్య సమీపంలోని భరత్‌నగర్‌లో ఉంటున్న తన చిన్న కొడుకు ఇంటికి వెళ్లాడు. బాలుడి తండ్రి నాగరాజు బుధవారం ఉదయం పనికి వెళ్లి తిరిగి రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూసేసరికి కొడుకు ఫ్యాన్ హుక్‌కు ఉరి వేసుకుని ఉండటాన్ని చూశాడు. వెంటనే ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారమివ్వడంతో ఘటనా స్థలానికి వారు చేరుకుని మృతికి గల కారణాలపై ఆరా తీశారు.

నాయినమ్మతో వీడని అనుబంధం

భవానీశంకర్‌కు 6 నెలల వయసు ఉన్నప్పుడే తల్లి మరణించడంతో నాయినమ్మ సుజాత వద్దే పెరిగాడు. ఆమెతో వీడని అనుబంధం పెంచుకున్నాడు. 15 రోజుల కిందట నాయినమ్మ మృతి చెందడంతో ఆరోజు నుంచి ముభావంగా ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. ఆమె దూరాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.